
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
సోమవారం 21 జూలై 2025



ఉల్లాసం లేని ఉల్లాస్

- నత్తనడకన అభ్యాసకుల గుర్తింపు
- టాస్ గడువు దగ్గర పడుతున్నా రిజిస్ట్రేషన్లలో జాప్యం
- సమన్వయ లోపంతో కదలని ప్రక్రియ

7

జోర్దార్‌గా సంగారెడ్డి బోనాల జాతర

సంగారెడ్డి, ఆంధ్రజ్యోతి, జూలై 20: సంగారెడ్డి పట్టణంలో బోనాల పండుగ అట్టహాసంగా జరిగింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఈ జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తన ఇంట్లో నుంచి బోనం బయల్దేరిన సందర్భం నుంచి ఊరేగింపులో పాల్గొన్నారు. డప్పుచప్పుళ్లు, పోతరాజుల నృత్యాలు, డీజే సౌండ్ పాటల నడుమ తనదైన శైలిలో స్టెప్పులేసి జోష్ నింపారు. అనంతరం ఏర్పాటు చేసిన వేదికపై కళాకారుల పాటలతో ఉత్సాహపరిచారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, శివశక్తి నిషాక్రాంతి బోనాలు ఎత్తుకొని ముందు నడిచారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంతకిషన్, కూన సంతోష్, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





బోనాల జాతరలో పోతరాజు నృత్యాల నడుమ జగ్గారెడ్డి

కడవేరుగులో 'నకిలీ' కలకలం

- రైతులకు పురుగుల మందు డబ్బాలు అంటగట్టే ప్రయత్నం
- నిలదీయడంతో కారులో పరారైన గుర్తుతెలియని వ్యక్తులు

చేర్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం కడవేరుగులో గుర్తుతెలియని వ్యక్తులు నకిలీ పురుగుల మందుల విక్రయానికి యత్నించడం కలకలం రేపింది. రైతుల సాగు అవసరాన్ని ఆసరా చేసుకుని అక్రమంగా అంటగట్టేందుకు యత్నించిన సంఘటన ఆదివారం చేర్యాల మండలం కడవేరుగు గ్రామంలో చోటుచేసుకుంది. సీజన్ ప్రారంభం నుంచి ఆశించిన వర్షాలు లేవు. రెండు రోజుల క్రితం భారీ వర్షం కురవడంతో పలువురు రైతులు వరి, పత్తి, మొక్కజొన్న, కూరగాయలు, తదితర చేలకు పురుగుల మందు పిచికారీ చేయడానికి ఉపక్రమించారు. ఈక్రమంలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు నంబరు లేని తెలుపురంగు కారులో గ్రామానికి చేరుకున్నారు. ఎక్ట్రీమ్, గ్రీన్-1, పేరు ముద్రితమైన పురుగులమందు డబ్బాలను తీసుకువచ్చి కంపెనీ ద్వారా రైతులకు ఆఫర్ కింద తక్కువ ధరకు అందజేస్తున్నామని నమ్మబలికించారు. దీంతో పలువురు రైతులు గుమిగూడి కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరిచి బేరమాడసాగారు. తీరా వారు బిల్లు ఇవ్వకపోవడంతో పాటు ప్రవర్తనలో అనుమానం వచ్చిన ఒకరిద్దరు నిలదీశారు. దీంతో ఎలాంటి సమాధానం ఇవ్వకుండా వెంటనే కారులో రాంసాగర్ వైపు ఉడాయించారు. చేర్యాల పోలీసులకు సమాచారం అందడంతో సిబ్బంది చేరుకుని వెంబడించినా అప్పటికే పరారయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి రైతులను మోసగించే వారిని పట్టుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ఎస్ఐ నవీన్‌ను వివరణ కోరగా సమాచారం అందుకుని తాము గ్రామానికి వెళ్లేసరికే విక్రేతలు పరారయ్యారని, రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకుని విచారణ చేస్తున్నామని తెలిపారు.



నకిలీ పురుగులమందు డబ్బాలు

బెల్టుషాపుల చిచ్చు

- పల్లెల్లో జోరుగా మద్యం విక్రయాలు
- అధిక ధరలకు అమ్మకం
- మద్యానికి బానిసవుతున్న యువత
- ఆగమవుతున్న కుటుంబాలు
- ఒకప్పటి మద్యరహిత గ్రామాలు.. నేడు విక్రయ కేంద్రాలు..
- ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యం.. మహిళల ఆగ్రహం

తొగుట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఒకప్పటి మద్యరహిత గ్రామాలుగా గుర్తింపు తెచ్చుకున్న చోటే నేడు.. మద్యం ఏరులై పారుతోంది. ప్రశాంతమైన పల్లెల్లోని కుటుంబాల్లో బెల్టుషాపులు చిచ్చురేపుతున్నాయి. గతంలో సమస్యాత్మక గ్రామాలను గుర్తించిన పోలీసులు ఆయా గ్రామాల్లో ప్రజలను చైతన్యవంతం చేసి మద్యరహిత గ్రామాలుగా తీర్చిదిద్దారు. కానీ నేడు ఆ గ్రామాల్లో సైతం విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కొనసాగుతుండటం గమనార్హం. తెల్లవారితే చాలు యువతరం మద్యానికి బానిసలుగా మారుతున్నారు. కొందరు బెల్టుషాపులను అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో మద్యం అమ్మకాల వ్యవహారం మూడు బీర్లు, ఆరు క్వార్టర్ సీసాలుగా కొనసాగుతుండటంతో మహిళలు మండిపడుతున్నారు.

సిద్దిపేట జిల్లాలో 93 వైన్స్ దుకాణాలు, 15 బార్లు ఉన్నాయి. ఒక్కో వైన్స్ పరిధిలో పదుల సంఖ్యలో గ్రామాలున్నాయి. ప్రతి గ్రామంలోనూ10 నుంచి 15 వరకు బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. కిరాణా దుకాణాలు, హోటళ్లు, దాబాలను అడ్డాగా చేసుకుని నిర్వాహకులు నిరాటంకంగా మద్యం వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. నిర్వాహకులు వైన్స్ నుంచి మద్యం కొనుగోలు చేసుకుని వచ్చి గ్రామాల్లో అధిక ధరలకు విక్రయించి లబ్ధి పొందుతున్నారు. దాంతో తాగిన మైకంలో గ్రామా ల్లో తరచూ ఏదో ఒకచోట గొడవలు జరుగుతుండటం పరిపాటిగా మారింది. బెల్టుషాపుల వద్ద నుండి మహిళలు వెళ్లాలంటేనే జంకుతున్నారు. తప్ప తాగిన యువకులు రోడ్డు వెంబడి వెళ్తున్న మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం నిత్యకృత్యమవుతోంది. మైకంలో వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నారు.

తొగుట మండలంలో 2018లో మద్యం మహమ్మారిపై అప్పటి తొగుట ఎస్ఐగా పనిచేసిన రంగకృష్ణ గౌడ్, సమస్యాత్మక గ్రామాలైన కాంగల్, ఘనపూర్, ఎల్లారెడ్డిపేట, వెంకట్రావ్‌పేట, ఏటిగడ్డకిష్టాపూర్ తదితర గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. మద్యం అమ్మకాలు, తాగడం చేయబోమని తీర్మానం చేయించి సంపూర్ణ మద్యపానరహిత గ్రామాలుగా తీర్చిదిద్దారు. అధికారులు బదిలీపై వెళ్లడం... ఆ తర్వాత ఎవరూ పట్టించుకోకపోవడంతో మళ్లీ యథాస్థితికి చేరుకున్నాయి. ఆయా గ్రామాల్లో నేడు మద్యం ఏరులై పారుతుంది. బెల్టుషాపులను అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు మామూళ్ల మత్తులో పడి వాటిని పట్టించుకోకపోవడంతో విచ్చలవిడిగా మద్యం వ్యాపారం కొనసాగుతున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఊపందుకుంటున్న ఉద్యమం

సంపూర్ణ మద్యపానరహిత గ్రామాలుగా తీర్చిదిద్దడం కోసం మహిళలు మళ్లీ ఉద్యమ బాట పట్టారు. అందుకు తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లి గ్రామం వేదికగా మారింది. గ్రామంలో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు మొత్తం మద్యం మహమ్మారి కారణమని గ్రహించిన మహిళలు ఏకమయ్యారు. మద్యం అమ్మినా, తాగినా కఠిన చర్యలు చేపడతామని మహిళలు తీర్మానం చేసుకుని మిగతా 8వ పేజీలో



ఘనపూర్‌లో మద్యపానం నిషేధిస్తున్నట్లు గ్రామస్థులతో ప్రమాణం చేయిస్తున్న అప్పటి ఎస్ఐ రంగకృష్ణగౌడ్ (ఫైల్)

ప్రాణాలు తీస్తున్నారు!

మెతుకుసీమలో రక్తపు మరకలు

వ్యవసాయ పంటలతో మెతుకుసీమగా వర్ధిల్లుతున్న ఉమ్మడి మెదక్ జిల్లాలో హత్యా సంస్కృతి విస్తరిస్తోంది. స్వల్ప వివాదాలకే ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. కత్తులు దూసుకోవడం, గొడ్డళ్లతో నరుక్కోవడం, వాహనాలతో ఢీ కొట్టించడం సహ తుపాకీ పేలుళ్ల దాకా ఈ హత్యలు పెచ్చరిల్లుతున్నాయి. పోలీసు యంత్రాంగం వైఫల్యంపైనా విమర్శలు వినిపిస్తున్నాయి.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, జూలై 20

'మెదక్ జిల్లా కొల్చారం మండలం అంసానిపల్లిలో సొంత అన్నను తమ్ముడు అందరూ చూస్తుండగా హత్య చేశాడు. ఈనెల 11న జరిగిన ఘటన సంచలనం సృష్టించింది. మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో దారుణంగా చితకబాది ఆ తర్వాత టవల్‌తో మెడకు ఉరిబిగించి చంపాడు. తోడబుట్టిన అన్న అనే కనికరం లేకుండా తమ్ముడు కడతేర్చాడు'.

'సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం ఖాజాపూర్‌లో అన్నదమ్ముల భూతగాదా విషయంలో తమ్ముడు రమేశ్‌కు అండగా తన స్నేహితుడు జైపాల్ వచ్చాడు. అక్కడ ఘర్షణ నెలకొనడంతో అన్న హన్మండ్లు, అతని కుటుంబసభ్యులు కత్తులు, గొడ్డళ్లతో దాడికి పాల్పడ్డారు. గత జూన్ 29వ తేదీన జరిగిన ఈ ఘటనలో జైపాల్ తల పగిలి అక్కడికక్కడే చనిపోగా, రమేశ్ తీవ్రంగా గాయపడ్డాడు'.

'సిద్దిపేట జిల్లా తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లికి చెందిన తాటికొండ రామవ్వ రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లుగా సమాచారం వచ్చింది. దీనిపై పలువురు అనుమానం వ్యక్తం చేయగా సొంత అల్లుడే ఆమె పేరిట ఇన్సూరెన్సు చేయించి ఆ డబ్బుల కోసం కారుతో ఢీకొట్టించి చంపించినట్లుగా తేలిపోయింది. మరో వ్యక్తితో ఒప్పందం చేసుకొని ఈనెల 7వ తేదీన ఈఘటనకు పాల్పడ్డాడు'.

- రోజురోజుకూ పెరిగిపోతున్న హత్యలు
- కారణం చిన్నదైనా.. పెద్దదైనా కత్తి దూస్తున్న వైనం
- ఉమ్మడి జిల్లా నలుమూలల్లోనూ ఘాతుకాలు
- దారుణాలపై అవగాహన కల్పించని పోలీసులు
- భయాందోళనలో ప్రజలు



సిర్గాపూర్ మండలం ఖాజాపూర్‌లో భూ తగాదాలపై సర్దిచెప్పడానికి వచ్చి హత్యకుగురైన మధ్యవర్తి (ఫైల్)

అయినవాళ్లే హంతకులు

ఉమ్మడి జిల్లాలో జరిగిన హత్యలను ఒకసారి పరిశీలిస్తే రక్తసంబంధీకులే తెరముందు, తెరవెనుక ఉంటున్నారు. ప్రత్యక్షంగా హత్యచేసినవాళ్లు కొందరైతే.. పరోక్షంగా హత్యలు చేయించినవారు ఇంకొందరు ఉన్నారు. వీటి వెనుక చిన్నపాటి కారణాలు, వివాహేతర సంబంధాలు వెలుగుచూశాయి.

- మునిపల్లి మండలం చీలపల్లిలో భూతగాదా విషయంలో సొంత తమ్ముడు శివయ్యను అన్న యాదయ్య బండరాయితో కొట్టి చంపిన ఘటన గత ఫిబ్రవరిలో జరిగింది.
- మునిపల్లి మండలం పెద్ద గోపులారంకు చెందిన హరిత ప్రియుడి మోజులో పడి తన భర్త రవిని కారుతో గుద్ది చంపాలని ప్లాన్ వేయగా తప్పించుకున్నాడు. దీనికి వివాహేతర సంబంధమే కారణం.
- నర్సాపూర్ మండలం చింతకుంటలో గత మే 12వ తేదీన కన్నతండ్రిపై కొడుకు కత్తితో దాడికి తీవ్రంగా గాయపరిచాడు. ఆస్తి పంచి ఇవ్వాలని కోరగా నిరాకరించడంతో ఈ ఘటనకు పాల్పడ్డాడు.
- వట్‌పల్లి మండలం పల్వట్లకు చెందిన మంగలి సాయిలు మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో అతని తమ్ముడు, బంధువులు కలిసి హత్య చేసి పూడ్చిపెట్టారు.
- సంగారెడ్డికి చెందిన డాక్టర్ గాదె సుమంత్‌రెడ్డిని ఆయన భార్య పథకం ప్రకారం హత్య చేయించింది. తన ప్రియుడికి ఆ బాధ్యతలు అప్పగించగా మరో వ్యక్తితో ఒప్పందం చేసుకొని ఈ ఘాతుకానికి పాల్పడ్డారు.
- పెద్దశంకరంపేట మండలం కమలాపూర్‌లో ఇటీవల కన్నకొడుకును తండ్రి రోకలి బండతో చితకబాది హత్యచేశాడు. కొడుకు డబ్బుల కోసం వేధిస్తుండడం, ఇవ్వకుంటే చంపుతాడనే భయంతో తండ్రే ఈ హత్యకు పాల్పడ్డాడు.
- పటాన్‌చెరు మండలం ఘన్‌పూర్‌లో ఆస్తి తగాదాల కారణంగా సొంత పెదనాన్నపై దిలీప్ అనే యువకుడు పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేశాడు. గత జూన్ నెలలోనే ఈ సంఘటన చోటు చేసుకుంది.

చిన్న విషయాలకే చిందుతున్న రక్తం

దారుణ హత్యల వెనుక సాధారణ కారణాలే ఉన్నాయి. భూ సమస్యలు, మంత్రాల నెపం, స్వల్ప తగాదాలు, డబ్బు విషయాలు కనిపిస్తున్నాయి. ఈ అంశాల్లో ఘర్షణ వాతావరణం నెలకొనడంతో కత్తులు దూసి చంపుకుంటున్నారు. తమ ఆలోచనా శక్తిని కోల్పోయి ఆవేశంలో హత్యలకు పాల్పడి మిగతా 7వ పేజీలో



అమ్మకు బోనం

- పల్లెలు, పట్టణాల్లో ఘనంగా బోనాల పండుగ



ఆషాడమాసం మాసం చివరి ఆదివారం సందర్భంగా సిద్దిపేటలో బోనాల సందడి నెలకొన్నది. పట్టణంలోని దీకొండ మైసమ్మ ఆయానికి భక్తులు తరలివచ్చి బోనం సమర్పించారు. పోతరాజు విన్యాసాలు శివసత్తుల పూనకాలతో పట్టణంలోని పలు వీధులు కోలాహలంగా మారాయి. కేవీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్ రావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

- సిద్దిపేట కల్చరల్ జూలై 20 (ఆంధ్రజ్యోతి)



మరిన్ని వార్తలు, ఫొటోలు 6లో..

పీఆర్సీని తక్షణమే ప్రకటించాలి

సిద్దిపేట కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పీఆర్సీని 40శాతం ఫిట్‌మెంట్‌తో జూలై 2023 నుంచి తక్షణమే ప్రకటించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గాడిపల్లి తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. బదిలీలతో కూడిన ప్రమోషన్ షెడ్యూల్‌ను విడుదల చేయాలని, జీపీఎఫ్ పార్ట్ ఫైనల్, పేమెంట్‌ను చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా కమిటీ సమావేశం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో జరిగింది. ఇటీవల గుండెపోటుతో మరణించిన జగదేవ్‌పూర్ మండల జిల్లా కౌన్సిలర్ కొత్తోజు సోమాచారికి జిల్లా కమిటీ పక్షాన సంతాపం ప్రకటించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన వర్క్ అడ్జెస్ట్‌మెంట్ జాబితాలను బహిర్గత పరచక పోవడంతో పలు అనుమానాలు వస్తున్నాయని, వెంటనే జాబితాను బహిర్గత పరిచి జిల్లా విద్యాశాఖ అధికారి సైట్‌లో అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

గురువన్నపేటలో కేంద్ర బృందం పర్యటన

కొమురవెల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామాన్ని నేషనల్ లైవ్ హుడ్ మిషన్ కేంద్ర బృందం సభ్యులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన పనుల పరిశీలనతో పాటు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు, పేదరిక నిర్మూలన చర్యలు, స్వయం ఉపాధి రుణాల వితరణ వంటి అంశాలను మహిళ సంఘంలోని సభ్యులను, గ్రామప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి నిర్మాణం చేపడుతున్న విధానాన్ని, ఎంత ఖర్చు వస్తుంది అనే వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీలో పెంచిన మామిడి తోటలను, నర్సరీలను, నిర్మించిన ఫారమ్ పాండ్ నిర్మాణాలను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకుని ఎలా అభివృద్ధి చెందుతున్నారనే విషయాలను ప్రజలతో చర్చించారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కను నాటారు. కార్యక్రమంలో కేంద్రబృందం సభ్యులు జోస్లీ జోసెఫ్, వినోద్, అడిషినల్ డీఆర్‌డీవో శ్రీనివాస్ గౌడ్, డీఎల్‌పీవో మల్లికార్జున్,ఏపీడీ సతీష్, ఎంపీడీవో శ్రీనివాస్ వర్మ, పీఆర్ ఏఈ శివకుమార్, మండల స్థాయి ఉపాధిహామీ అధికారులు, పంచాయతీ కార్యదర్శి కరుణాకర్ పాల్గొన్నారు.



కొమురవెల్లి మండలం గురువన్నపేటలో కేంద్ర బృందం సభ్యులను సన్మానిస్తున్న స్థానిక అధికారులు, గ్రామస్థులు





జహీరాబాద్ : పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో బోనాలతో అమ్మవారి ఆలయం వద్దకు వెళ్తున్న భక్తులు



సిద్దిపేటలో..

బోనం.. ఘనం

ఆషాఢమాస బోనాలు మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని పోతరాజుల నృత్యాలు, డప్పుచప్పుళ్లు, డీజే సౌండ్ల నడుమ ఊరేగింపుగా వచ్చి ముత్యాలమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, పోచమ్మ, మహంకాళీమాతకు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చమని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి ఆయా ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

-న్యూస్ నెట్‌వర్క్(ఆంధ్రజ్యోతి)



వట్‌పల్లి : గౌరైకల్‌లో బోనం ఎత్తుకున్న బ్రీడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి



మెదక్‌లో బోనాల ఊరేగింపు



చేర్యాలలో పోతరాజుల వేషధారణలో చిన్నారులు



పాపన్నపేటలో మున్నూరు సంఘం ఆధ్వర్యంలో..



సిద్దిపేట పట్టణం కాళ్లకుంట కాలనీలో..



సిద్దిపేటలో దీకొండ మైసమ్మకు బోనాల తీసుకెళ్తున్న మహిళలు



చేగుంట మండల కేంద్రంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



సిద్దిపేట పట్టణంలో బోనాల ఊరేగింపు



పలహారం బండి ఊరేగింపులో తెలంగాణ ముదిరాజ్ మహాసభ మహిళా అధ్యక్షురాలు మందుల వరలక్ష్మి, మహిళా నేతలు

తాగునీటి ఎద్దడి పరిష్కరించాలి

● బోజ్యతండాలో గిరిజనుల ఆందోళన



బోజ్యతండాలో ఆందోళన చేస్తున్న గిరిజనులు

శివ్వంపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : గత 15 రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాక తాగునీటి కోసం తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ బోజ్యతండాకు చెందిన మహిళలు ఆదివారం ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. తండాలో మిషన్ భగీరథ నల్లాల ద్వారా నీళ్లు వారానికి ఒకసారి అరకొరగా సరఫరా అవుతుండడంతో పొలాలకు వెళ్లి తెచ్చుకుంటున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వారంరోజులుగా తాగునీటి కోసం పంట పొలాల్లోకి వెళ్తే రానివ్వడం లేదని వాపోయారు. అధికారులు స్పందించి తండాకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి, శాశ్వత నీటి పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కొల్చారం, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కొల్చారం వసతి గృహ సంక్షేమ అధికారులు అప్రమత్తంగా ఉండి విద్యార్థుల ఉన్నత విద్యా ప్రమాణాలే లక్ష్యంగా పనిచేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ఆదివారం కొల్చారం మండలం బీసీ వెల్ఫేర్ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, స్టోర్‌రూమ్, మెనూ, వసతి గృహంలో మరుగుదొడ్లను, వసతి గృహ నిర్వహణ తీరు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహాల్లో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచాలని సూచించారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలపై ఆసక్తిని కల్పిస్తూ కొత్తగా చేరిన విద్యార్థుల పట్ల దృష్టి పెట్టాలన్నారు. ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ వెంట బీసీ వసతి గృహ వార్డెన్ ఉమ, వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొల్చారం బీసీ హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్



దెబ్బతిన్న పంట పరిశీలన

వట్‌పల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురిసిన వర్షాలకు కేరుర్,నాగులపల్లి,బిజిలిపూర్ ఆయా గ్రామాల్లో పత్తి వరి తదితర పంటలు దెబ్బ తినడంతో ఆదివారం వ్యవసాయ అధికారులు గ్రామాలకు వెళ్లి దెబ్బతిన్న పంటలను పరిశీలించినట్లు ఏవో శ్రీనివాస్ రెడ్డి తెలిపారు పంట నష్టాన్ని ఉన్నత అధికారులకు అందజేస్తామన్నారు

షార్ట్ సర్క్యూట్‌తో గృహం దగ్ధం

పాపన్నపేట, జూలై 20(ఆంధ్రజ్యోతి) : షార్ట్ సర్క్యూర్‌తో నివాస గృహం దగ్ధమైన సంఘటన పాపన్నపేట మండల పరిధిలోని కుర్తివాడలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన అంతగోని సాయిబాబా కుటుంబ సభ్యులందరూ ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లగా షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఇంటి పైకప్పు నుంచి నిప్పుతో కూడిన పొగలు రావడంతో స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు మంటలు ఆర్పేశారు. ఈ అగ్ని ప్రమాదంలో తమ వంట సామాగ్రి, బట్టలు, వెండి, నగదు మంటల్లో బూడిద అయ్యాయని బాధిత కుటుంబం కన్నీరు పెట్టుకున్న ఘటన అందరిని కలిచివేసింది. సుమారు 5 నుంచి 6 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

కాలి బూడిదైన బోరు స్టార్టర్

నిజాంపేట, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాళీ బూడిదైనా బోర్ మోటార్ స్టార్టర్. మండల కేంద్రంలోని నాలుగో వార్డులో ఆదివారం సాయంత్రం కరెంటు పోలుకు బిగించిన స్టార్టర్ డబ్బాకు ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి మంటలను అదుపు చేసి విద్యుత్ సరఫరాను నియంత్రించారు. దీంతో ఇలాంటి ప్రమాదం సంభవించలేదు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

టేక్మాల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి చెరువులో పడి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పల్వంచ గ్రామంలో ఆదివారం జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కలాలి రాజాగౌడ్(55) శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయి తిరిగిరాలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా.. ఆయన ఆచూకి లభించలేదు. ఆదివారం పల్వంచ గ్రామ శివారులోని చెరువులో రాజాగౌడ్ శవమై తేలాడు. ఈ విషయాన్ని గ్రామస్థుల ద్వారా తెలుసుకున్న కుటుంబీలు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పాముకాటుతో యువరైతు మృతి



రవి (ఫైల్)

దుబ్బాక, జూలై20(ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో యువ రైతు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాక మున్సిపాలిటీ చెల్లాపూర్ వార్డుకు చెందిన కంకనాల రవి(36) తన వ్యవసాయ పొలం వద్దకు శనివారం రాత్రి వెళ్లగా పాము కాటువేసింది. సమాచారం అందుకు కుటుంబ సభ్యులు అతడిని దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. రవికి భార్య మాధవి, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వార్డు మాజీ కౌన్సిలర్లు దేవలక్ష్మి, మట్ట మల్లారెడ్డి, ఆయా పార్టీల నాయకులు కోరారు.

అనారోగ్యంతో ఇంటర్ విద్యార్థి..



వెంకటేష్(ఫైల్)

నాగల్‌గిద్ద, జూలై 20(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఇంటర్ విద్యార్థి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ముక్టాపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సంజీవ్‌పటేల్ కుమారుడు వెంకటేష్(17) ఇంటర్ చదువుతున్నాడు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం వెంకటేష్ మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. విద్యార్థి అంత్యక్రియల్లో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కత్తిపీటతో గొంతుకోసుకుని..

● చేర్యాలలో వలసకూలీ ఆత్మహత్యాయత్నం

చేర్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కత్తిపీటతో గొంతుకోసుకుని ఓ వలస కూలీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం చేర్యాలలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కోనరావుపల్లి గ్రామానికి చెందిన పలువురు కూలీలు చేర్యాలలోని ఓ లే-అవుట్‌లో డెవలప్‌మెంట్ పనులు చేస్తున్నారు. వారి తాలూకు అదే గ్రామానికి చెందిన శేఖర్(52) పనులకోసం రెండు రోజుల క్రితం చేర్యాలకు వచ్చాడు. స్థానిక పెద్దమ్మగడ్డ శివారులో వారంతా అద్దెకు ఉంటున్న ఇంట్లో కూరగాయలు కోసే కత్తిపీటతో బాత్‌రూంలోకి వెళ్లి గొంతు గోసుకున్నాడు. గమనించిన మిగతా కూలీలు చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే తీవ్ర రక్తస్రావమై అపస్మారక స్థితికి చేరుకోవడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఉన్నతాస్పత్రికి తరలించాలని వైద్యులు సూచించారు. దీంతో శేఖర్‌ను హుటాహుటిన సిద్దిపేట ఏరియాకు తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. అతడి ఆత్మహత్యాయత్నానికి గల కారాణాలు తెలియరాలేదు.



అపస్మారకస్థితిలో శేఖర్

ఈ-హుండీలు ప్రారంభం

● ఆన్‌లైన్‌లో చెల్లింపులకు అవకాశం



ఈ-హుండీలను ప్రారంభిస్తున్న ఆలయ ఈవో అన్నపూర్ణ, అర్చకులు

కొమురవెల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : హుండీలను సులభంగా, మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు మల్లన్న ఆలయ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. భక్తుల సౌకర్యార్థం దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆన్‌లైన్ చెల్లింపులకు వీలుగా ఆలయంలో ఈ-హుండీలను ఏర్పాటు చేశారు. కొమురవెల్లి ఎస్‌బీఐ బ్యాంకు అధికారులు అందించిన వీటిని ఆదివారం ఆలయ ఈవో అన్నపూర్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త జయప్రకాశ్‌రెడ్డి ఈ హుండీ ద్వారా రూ.10,116 విశాళంగా చెల్లించారు. ఈ సందర్భంగా ఈవో అన్నపూర్ణ మాట్లాడుతూ ఆలయంతో పాటు భక్తుల రద్దీ అధికంగా ఉండే టికెట్ కౌంటర్ నిత్యాన్నదాన సత్రం తదితర స్థలాలలో ఈ-హుండీలను ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో నగదు సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఏఈవో శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, అర్చకులు మనోహర్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ



గంగిరేణి చెట్టు వద్ద పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కొమురవెల్లి, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. కోనేరులో స్నానమచరించి, గంగిరేణి చెట్టు వద్ద, ఆలయ ముఖ మండపంలో పట్నాలు వేసి బోనాలు సమర్పించారు. అనంతరం స్వామివారిని, ఎల్లమ్మ, పోచమ్మ అమ్మవార్లను దర్శించుకొని ఒడిబియ్యం పోసి పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో అన్నపూర్ణ, ఏఈవో శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దుర్గమ్మ సేవలో కలెక్టర్ దంపతులు



అమ్మవారిని దర్శించుకుంటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్ దంపతులు

పాపన్నపేట, జూలై 20(ఆంధ్రజ్యోతి) : ఆషాఢ మాసం చివరి ఆదివారం వనదుర్గమ్మ తల్లి తీరొక్క రంగు పూలతో అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కలెక్టర్ రాహుల్ రాజ్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ మర్యాదల ప్రకారం అర్చకులు, ఆలయ సిబ్బంది స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. అర్చకులు శంకరశర్మ, పార్థివ శర్మ దుర్గమ్మను వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. తెల్లవారు జాము నుండే ఏడుపాయలకు తరలి వచ్చిన భక్తులు మంజీర నదిలో స్నానాలు చేసి, బోనాలు తీసి, ఒడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పచ్చని చెట్ల కింద టెంట్లు వేసుకొని సేద దీరిన భక్తులు, విందులు చేసుకొని, వినోదాలతో గడిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది, పోలీసులు చర్యలు తీసుకున్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

జహీరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : 2025-26 సంవత్సరానికి సంబంధించి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన అతిథి అధ్యాపకుల నియామకానికి నోటిఫికేషన్ జారీచేశామని కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ అస్లాం ఫారూఖీ తెలిపారు. హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ, కామర్స్ తెలుగు, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ బొటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 23న జహీరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని, 24న జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.



కంది శివారులోని కాశీపూర్ వద్ద ఆదివారం ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో సీడ్‌బాల్స్ విసురుతున్న జైళ్లశాఖ సిబ్బంది

అడవుల వృద్ధికి సీడ్ బాల్స్

● ఖైదీలతో 25 వేల సీడ్ బాల్స్ తయారు చేయించిన జైళ్లశాఖ

● ఖాళీ స్థలాల్లో వెదజల్లిన సిబ్బంది

కంది, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో అడవుల వృద్ధికి జైళ్లశాఖ కృషి చేస్తున్నది. ఈ మేరకు విత్తనాలతో కూడిన బంతులకు తయారు చేయిస్తూ ఖాళీ ప్రదేశాల్లో విసిరిరేసేలా చర్యలు తీసుకుంటున్నది. ఇప్పటికే జైల్లోని ఖైదీలతో 25 వేల సీడ్ బాల్స్ (విత్తనబంతులు) తయారు చేయించారు. ఈ విత్తన బంతుల్లో ఎక్కువగా వేప, చింత, కానుగా, వివిధ రకాల పూలు, పండ్లకు సంబంధించి విత్తనాలను నింపారు.



సీడ్‌బాల్స్ నుంచి మొలకెత్తుతున్న మొక్కలు



సిబ్బందికి సీడ్‌బాల్స్ పంపిణీ చేస్తున్న జైలు సూపరింటెండెంట్ కళాసాగర్

విసిరినప్పుడు పగిలిపోకుండా..

అడవుల్లో బలంగా విసిరినప్పుడు వెంటనే పగిలిపోకుండా కాగితం గుజ్జు లాంటివి ఈ బంతికి పూతగా వేస్తారు. దీంతో వర్షం వచ్చినప్పుడు అది బాగా తడిసి నీటిని విత్తనానికి అందించి అది ఎదిగే దశలో జాగ్రత్తగా విచ్చుకుంటాయి. ప్రధానంగా ఎరుపు బంక మట్టి, హ్యూమస్ లేదా కంపోస్ట్ వంటి వాటితో విత్తనాన్ని చుట్టి బాల్స్‌గా తయారు చేస్తారు. విత్తనాల చుట్టూ, బంతి మధ్యలో, సూక్ష్మజీవుల ఇనాక్యులెంట్లను అందించడానికి ఉంచుతారు. కాటన్-ఫైబర్స్ ద్రవీకృత కాగితం కొన్నిసార్లు బంకమట్టిలో దానిని బలోపేతం చేయడానికి కలుపుతారు. దీని ద్వారా ఎక్కువ మొక్కలు పెరిగి అడవులు అభివృద్ధి చెందుతాయి.

వాహనదారులకు అందజేస్తూ..

జైళ్లశాఖ పెట్రోల్‌బంకులో పనిచేస్తున్న ఖైదీలు, సిబ్బంది ద్వారా వాహనదారులకు సీడ్ బాల్స్ అందజేస్తూ రోడ్ల వెంబడి, ఖాళీ ప్రదేశాల్లో విసిరివేయాలని సూచిస్తున్నారు. జైళ్లశాఖ చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమానికి ప్రజల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి.

ఆదివారం ఒక్కరోజే 17 వేల బాల్స్ పంపిణీ..

ఆదివారం సంగారెడ్డి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ కళాసాగర్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట, మెదక్, సబ్ జైళ్లతోపాటు, సంగారెడ్డి పట్టణంలోని పాతజైలు ఆఫీస్‌లో సిబ్బందికి 17 వేల సీడ్ బాల్స్‌ను పంపిణీ చేశారు. ఈ మేరకు జైలు సిబ్బంది కంది మండలంలోని కాశీపూర్ వద్దనున్న ప్రభుత్వ ఖాళీస్థలాల్లో ఆ బాల్స్‌ను విసిరారు.



సీడ్ బాల్స్ నుంచి వచ్చిన మొలకలు

ప్రాణాలు తీస్తున్నారు!

(5వ పేజీ తరువాయి)

జైలు పాలవుతున్నారు.

- కొడిపల్లి మండల కేంద్రంలో గత ఏడాది భూమయ్య అనే రైతును తన పొలం వద్దనే దారుణంగా హత్య చేశారు. ఆనాడు డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేశారు. దర్యాప్తును మధ్యలోనే వదిలేయడంతో ఇప్పటికీ ఎవరు హత్య చేశారో తేలలేదు.
- అల్లాదుర్గం మండలం సీతానగర్ శివారులో కాయిదంపల్లి వాసి ముసిరిగారి మల్లయ్యను గత ఫిబ్రవరిలో హత్య చేశారు. అప్పు ఇచ్చిన డబ్బులు అడగడమే ఆయన చేసిన పాపం.
- సిద్దిపేట అర్బన్ మండలం రంగధాంపల్లి సమీపంలో పెద్ద మాసాన్‌పల్లికి చెందిన ఓ వ్యక్తిపై బండరాయి వేసి మరో వ్యక్తి చంపాడు. కల్లు డిపోలో జరిగిన ప్రేమాయణమే దీనికి కారణం.
- కొమురవెల్లి మండలం ఐనాపూర్‌కు చెందిన వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి పోలీస్ స్టేషన్ లోనే కారుతో ఢీ కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈనెల 17న జరిగిన ఈ ఘటనకు భూవివాదాలే కారణం.
- జహీరాబాద్ పట్టణానికి చెందిన తాజొద్దీన్‌ను మంత్రాలు చేస్తున్నాడనే కారణంతో ముగ్గురు వ్యక్తులు మరణాయుధాలతో హత్య చేసి సంచిలో చుట్టి బావిలో పడేశారు. ఈ నెల 12న ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.
- న్యాల్కల్ మండలం రుక్మాపూర్‌లో ఒంటరిగా ఉంటున్న రాణెమ్మ అనే మహిళను అదే గ్రామానికి చెందిన రాజు అనే యువకుడు హత్య చేశాడు. బెట్టింగులకు అలవాటుపడి ఆమె నగల కోసం గత మే 26న ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు.
- చిన్నశంకరంపేట మండలంలో మల్లేశ్ అనే వ్యక్తి తన సైకోయిజంతో ఇద్దరిని హత్య చేశాడు. తన మాయమాటలతో మద్యం తాగించి వారిని సజీవ దహనం చేశాడు.
- మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లోని ఓ పరిశ్రమలో నలీన్‌కుమార్ అనే వ్యక్తిని మరో కార్మికుడు దారుణంగా హత్య చేశాడు. చిన్నపాటి తగాదాతోనే గత మే 29న ఈ ఘాతుకాన్ని పాల్పడ్డాడు.

కాంట్రాక్టు మర్డర్లతో కలకలం

ఒకప్పుడు నక్సలైట్ల చేతుల్లో పోలీసులు, పోలీసుల చేతుల్లో నక్సలైట్లు చనిపోయిన ఘటనలే మెతుకుసీమలో ఎక్కువగా ఉండేవి. నక్సలైట్లు కనుమరుగు కావడంతో ఈ పరిస్థితి కూడా తలెత్తలేదు. వివాహేతర సంబంధాలు, మంత్రాల నెపంతో జరిగే హత్యలు అప్పుడప్పుడు చోటుచేసుకునేవి. కానీ ఇటీవల రోజుల్లో చిన్న విషయాలకు కూడా ప్రాణాలు తీసుకుంటున్న పరిస్థితి నెలకొంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం, భూతగాదాల విషయంలో ఏకంగా కత్తులు దూయడం, తుపాకులు పేల్చడం వంటి ఘటనలు దాపురిస్తున్నాయి. తాజాగా కాంగ్రెస్ నేత అనిల్‌ను తుపాకితో కాల్చి చంపడం కూడా ఇలాంటి కోవకే వస్తుంది. ఇక తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లిలో డబ్బు ఆశచూపించి ఓ వ్యక్తితో కాంట్రాక్టు కుదుర్చుకొని తన అత్తను హత్య చేయించడం సంచలనం సృష్టించింది. ఇక అక్రమ సంబంధాలు ఏర్పరుచుకొని భర్తలను చంపించడంలోనూ భార్యలు కాంట్రాక్టు మర్డర్లకు ప్లాన్ చేసిన ఘటనలు సైతం జిల్లాలో కనిపిస్తున్నాయి.



కొల్చారం మండలం అంసానిపల్లిలో మంత్రాల నెపంతో అన్నను చితకబాది ఉరితీయించి చంపిన తమ్ముడు (ఫైల్)



పటాన్‌చెరు మండలం ఘన్‌పూర్‌లో ఆస్తితగాదాల విషయంలో తమ్ముడి కొడుకు పెట్రోల్ పోసి నిప్పంటించడంతో చనిపోయిన రాములు(ఫైల్)

అవగాహన కల్పించని పోలీసులు

హత్యలు జరిగిన తర్వాత తెరమీదకొచ్చే పోలీసులు ఆ హత్యలు జరగకుండా అవగాహన కల్పించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. హత్యలు జరిగిన చోట నిందితులను వెనువెంటనే పట్టుకొని వారికి పడిన శిక్షలపై స్థానికంగా చర్చించాల్సిన అవసరం ఉంది. హత్యలకు పాల్పడితే భవిష్యత్తులో జరిగే నష్టాలపైనా ప్రజల్లో ప్రచారం చేయాల్సి ఉంది. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాలైన పటాన్‌చెరు, జిన్నారం, తూప్రాన్, మనోహరబాద్, సంగారెడ్డి ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాల కార్మికులు చిన్నపాటి ఘర్షణలకే చంపుకుంటున్నారు. ఇక్కడ అవగాహన కార్యక్రమాలు చేపట్టడం లేదు. పక్క రాష్ట్రాల సంస్కృతి మన జిల్లాకూ విస్తరించడానికి ఈ ఉదంతాలు కారణమవుతున్నాయి. గ్రామాల్లో వ్యక్తుల మధ్య ఉన్న భూతగాదాలు, మంత్రాల నెపం ఆరోపణలపై ముందుగానే దృష్టి పెట్టి వారికి కౌన్సెలింగ్ ఇప్పిస్తే హత్యలను నియంత్రించే అవకాశం ఉంటుంది. గ్రామస్థాయిలో ఉన్న పోలీసు నిఘాను మరింత పటిష్టం చేస్తేనే ఇది సాధ్యమవుతుంది. లేదంటే మరిన్ని హత్యలతో మెతుకుసీమలో రక్తం పారక తప్పదు.

22న సిర్గాపూర్ కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

కల్హేర్/సిర్గాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్‌లోని కేజీబీవీలో ఈ నెల 22న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి సంతోషి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 20 సీట్లు ఖాళీ ఉన్నాయని, వీటి భర్తీ కోసం 22న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌వో సంతోషి సూచించారు.

హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ

● ఎస్‌బీఐఆర్‌ఎస్‌ఈటీఐ ఇన్‌చార్జి డైరెక్టర్ సూర్యప్రకాష్

సంగారెడ్డి రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువకులకు హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి కల్పనా శిక్షణా కేంద్రం (ఎస్‌బీఐఆర్‌ఎస్‌ఈటీఐ) ఇన్‌చార్జి డైరెక్టర్ సూర్యప్రకాష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి 18 నుంచి 45 యేళ్లు ఉన్నవారు అర్హులని, అర్హత, ఆసక్తి గల వారు సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతితో పాటు భోజన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, ఆగస్టు 11వ తేది నుంచి నెల రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తారన్నారు. పూర్తి వివరాలకు 9490103390, 9490129839 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉల్లాసం లేని ఉల్లాస్

● నత్తనడకన సాగుతున్న అభ్యాసకుల గుర్తింపు

● టాస్ గడువు దగ్గర పడుతున్నా రిజిస్ట్రేషన్లలో జాప్యం

● సంబంధిత శాఖల సమన్వయ లోపంతో కదలని ప్రక్రియ

సిద్దిపేట కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి) : వివిధ కారణాల వల్ల విద్యకు దూరమైన వయోజనులకు అక్షరజ్ఞానం నేర్పించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమమే ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ సొసైటీ) పలు శాఖల సమన్వయ లోపం వల్ల సిద్దిపేట జిల్లాలో ముందుకు సాగడం లేదు.



ఉల్లాస్, టాస్‌కు సంబంధించి ప్రాస్పెక్టస్ చూపిస్తున్న విద్యాశాఖ అధికారులు

గుర్తించడమెలా ?

ముందుగా నాన్ లిటరేట్స్‌ను క్షేత్రస్థాయిలో గుర్తించాల్సి ఉంటుంది. గుర్తించిన వారి వివరాలు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం మెప్మా, డీఆర్డీఏ, అంగన్‌వాడీలు, మహిళా సమాఖ్యలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇలా క్షేత్రస్థాయిలో పనిచేసే వారు నాన్ లిటరేట్స్‌ను గుర్తించాల్సి ఉంటుంది. 14 ఏళ్లలోపు ఉన్నవాళ్లు, 15 ఏళ్లపైబడినవారు, మధ్యలో చదువు ఆపేసిన వాళ్లను గుర్తించాలి. గుర్తించిన వారి వివరాలు ఉల్లాస్ అప్లికేషన్‌లో అప్లోడ్ చేయాలి.. అలా గుర్తించినవారిని 10 మందిని కలిపి ఒక బ్యాచ్ చేసి ఒక వాలంటీర్‌ను ఏర్పాటుచేసి వారికి బేసిక్ నాలెడ్జ్ నేర్పిస్తారు. ఇందులో కాస్తా మెరుగ్గా ఉన్నవారిని ఓపెన్ టెన్త్ అడ్మిషన్ తీసుకునేలా ప్రోత్సహించాలి. లేదంటే టెన్త్ పూర్తిచేసి చదువు మధ్యలో ఆపేసిన వారిని ఓపెన్ ఇంటర్‌లో చేరేలా చూడాలి. మొత్తానికి నిరక్షరాస్యత శాతం తగ్గించి, అక్షర భారతానికి పునాదులు వేయాలి.

లోపమెక్కడుంది

ఉల్లాస్ ప్రక్రియ సిద్దిపేట జిల్లాలో సంబంధిత శాఖల మధ్య సమన్వయలోపం వల్ల ముందుకు సాగడం లేదు. కొంత ముందుకెళ్లినా అనుకున్న స్థాయిలో ఫలితాలు కనిపించటం లేదు. జూన్ 30 వరకు నాన్ లిటరేట్స్ గుర్తింపు జరగాల్సి ఉంది. ప్రాథమికంగా జరగాల్సిన గుర్తింపు ప్రక్రియ అనుకున్నంత స్పీడ్‌గా ముందుకెళ్లడం లేదు. ఇదిలా ఉంటే గుర్తించిన అభ్యాసకుల వివరాలు ఆన్‌లైన్ చేయడానికి, వారికి వాలంటీర్లను కేటాయించడంలోనూ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఆసక్తి గల అభ్యాసకులను గుర్తించి 10 మందికి ఒక వాలంటీర్‌ను ఏర్పాటు చేయాలి. దీనినే మ్యాచింగ్ బ్యాచింగ్ (ట్యాగింగ్) అంటారు. మొత్తం జిల్లావ్యాప్తంగా ఉన్న 26 మండలాల్లో 21,717 మంది అభ్యాసకులు ఉన్నారు. ఇప్పటివరకు 6443 మందిని మాత్రమే మ్యాచింగ్ చేసి ఒక బ్యాచ్‌గా (ట్యాగ్) చేశారు. ఇంకా 15473 మంది అన్‌ట్యాగ్ లిస్టులో ఉన్నారు. వీరికి వాలంటీర్లను ఏర్పాటు చేసి బ్యాచ్‌లు చేయాల్సి ఉంది. జిల్లాలో 1,386 మంది వాలంటీర్లు ఉంటే కేవలం 688 మంది వాలంటీర్లను ట్యాగ్ చేశారు. 698 మంది వాలంటీర్లకు బ్యాచ్‌లు ఇవ్వాల్సి ఉంది. కొన్ని మండలాల్లో సరాసరి చూస్తే పూర్తిస్థాయిలో 50 శాతం కూడా ట్యాగింగ్ కావటం లేదు. మరోవైపు ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లకు సంబంధించిన గడువును పెంచారు. ఈ నెల 31 వరకు అవకాశం ఉంది. కాస్తా బేసిక్ నాలేడ్జ్ ఉన్నవాళ్లు ఉంటే ఓపెన్ టెన్త్ అవకాశం ఉంటుందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి అక్షరాస్యత శాతం పెంచాల్సిన అవసరముందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.



రెయిన్ గన్స్‌తో పంటకు నీరు

నారాయణఖేడ్, జూలై 20(ఆంధ్రజ్యోతి): వర్షాభావ పరిస్థితులతో పత్తి పంట రక్షణ కోసం రైతు రెయిన్ గన్‌లను వినియోగిస్తూ పంటను కాపాడుకుంటున్నాడు. నారాయణఖేడ్ మండలం గంగాపూర్‌కు చెందిన నర్సింహారెడ్డి 14 ఎకరాల్లో పత్తి, 3 ఎకరాల్లో పెసర, మినుము, 3 ఎకరాల్లో వరి సాగు చేశాడు. వానలు సరిగా పడకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. దీంతో బోరు మోటార్ నుంచి వచ్చే నీటిని పంటకు వాడేందుకుగాను చిన్నపాటి మోటార్‌తో ఉండే రెయిన్ గన్‌ను కొనుగోలు చేశాడు. ఆ గన్‌కు పైపులను బిగించి, తన పొలంలో వర్షం లాగా మొక్కలపై నీటిని పడేలా అమర్చాడు. రోజుకు ఒక ఎకరా చొప్పున రెయిన్ గన్‌తో నీటిని అందించగల్గుతున్నాడు. ఈ గన్ కోసం రూ.7 వేల వరకు ఖర్చు అయిందని నర్సింహారెడ్డి తెలిపాడు.

చెత్తశుద్ధిలో కరువైన చిత్తశుద్ధి

మురికిపాలిటీగా చేర్యాల బల్దియా

- నిరుపయోగంగా డంపింగ్‌యార్డు షెడ్
- పట్టణ శివారులో... రోడ్డుపక్కన, పాడుబడిన బావులు, గోతుల్లో యథేచ్ఛగా చెత్త డంపింగ్
- ఇష్టానుసారంగా కాల్చివేతలతో పొగ కాలుష్యం
- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జిల్లాలోనే అధ్వానం


చేర్యాల శివారులో నిరుపయోగంగా డంపింగ్‌యార్డు షెడ్

చేర్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మునిసిపల్ పరిధిలో చెత్తశుద్ధి లేక ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. స్వచ్ఛ చేర్యాలగా తీర్చిదిద్దాలనే ఆకాంక్షలపై నిర్లక్ష్యం నీడలు కమ్ముకున్నాయి. మునిసిపాలిటీగా ఏర్పడి ఏడేళ్లు కావస్తున్నా చెత్తశుద్ధి ప్రణాళికలు కార్యాచరణకు నోచుకోకపోవడం ప్రజలపాలిట శాపంగా మారింది. పన్నులు, ట్రేడ్‌లైసెన్స్ ఫీజుల వసూళ్లపై మున్సిపల్ అధికారులు చూపుతున్న శ్రద్ధలో కొంతమేరైనా ప్రజారోగ్య పరిరక్షణ చర్యలపై సారించకపోవడమేంటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అరకొరగా చెత్త సేకరణ

చేర్యాల మునిసిపల్ పరిధిలో 20వేలకుపైగా జనాభా, పది శివారుకాలనీలతో కూడిన 12వార్డులు ఉన్నాయి. చెత్తను సేకరించేందుకు మునిసిపల్ ఆధ్వర్యంలో పలు ట్రాక్టర్లు, ఆటోలను వినియోగిస్తున్నారు. ప్రతీ వార్డుకో వాహనం చొప్పున కేటాయించి ఇళ్ల నుంచి అరకొరగా సేకరిస్తున్నప్పటికీ డంపింగ్ యార్డుకు తరలించడం లేదు. చాన్నాళ్లక్రితమే పట్టణ శివారులో డంపింగ్‌యార్డు పనులు చేపట్టారు. కొంత కాలంపాటు అందులోనే డంప్ చేసినప్పటికీ తడి, పొడి చెత్తను వేరుచేయడానికి వీలుగా ప్లాట్‌ఫాంల నిర్మాణం చేపట్టనేలేదు.

వృథాగా డంపింగ్‌యార్డు

తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టు తయారు కోసం డంపింగ్‌యార్డు ఉన్నప్పటికీ అందుబాటులోకి తీసుకురాలేక ఎక్కడబడితే అక్కడ పట్టణ శివారులో రోడ్డుపక్కన డంప్ చేస్తూ చెత్త, వ్యర్థాలను యథేచ్ఛగా కాల్చివేస్తున్నారు. దీంతో పొగ కాలుష్యం స్థానికులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. అంతేకాకుండా పేరుకుపోతున్న చెత్త పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతుండగా, మరోవైపు దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో ఆ దారి వెంట వెళ్లే ప్రయాణికులు, రైతులు మునిసిపల్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



తూర్పుగుంటుపల్లి కాలనీకి వెళ్లేమార్గంలో రోడ్డుపక్కన చెత్తను కాల్చివేస్తున్న దృశ్యం, పొలాల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు

వ్యవసాయ భూముల్లోకి చెత్త

రోజువారీగా సేకరిస్తున్న చెత్తనంతా పట్టణ శివారులో పాడుబడిన బావులు, గోతులతో పాటు పలు మార్గాల లో రోడ్డు పక్కన పారబోస్తున్నారు. గతంలో చెన్నకే శవాలయం, పాలిటెక్నిక్ కళాశాల సమీప ప్రదేశం, పెద్దమ్మగడ్డ జడ్పీఎస్ఎస్‌కు వెళ్లేమార్గంలో రోడ్డుపక్కనే డంప్ చేసేవారు. కొన్నాళ్లుగా బీడీ కాలనీ, వెలుగలవారి కాలనీల చెంత ఉన్న దేవాదుల కాలువ పక్కనే వ్యవసాయభూమిలో గోతులతో పాటు తూర్పు గుంటూరుపల్లికి వెళ్లే మార్గంలో రోడ్డుపక్కన ఓ పాడు బడిన బావిలో డంప్‌చేసే క్రమంలో ఇష్టానుసారంగా చెత్తను పారబోస్తున్నారు. చెత్త, వ్యర్థాలను కాల్చకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ తగులబెడుతుండటంతో పొద్దంతా ఘాటైన పొగ కమ్ముకొంటున్నది. ఈదురు గాలులకు చెత్త, చెదారం కొట్టుకువస్తూ సమీపంలోని వ్యవసాయపొలాల మధ్య చేరడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై మునిసిపల్ అధికారులు చొరవ వహించి చెత్త కష్టాలు తొలగించాలని కోరుతున్నారు.

స్వచ్ఛసర్వేక్షణ్‌లోనూ అధ్వానం

చెత్తసేకరణ, నిర్వహణకు సంబంధించి కేంద్రపట్టణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే-2024-25లో చేర్యాల మునిసిపాలిటీ రాష్ట్రంలో 149, జాతీయస్థాయిలో 1815వ స్థానంలో నిలవడం పారిశుధ్య లోపం తీవ్రతను ఎత్తిచూపుతున్నది. తడి, పొడి చెత్త సేకరణతో పాటు వేరుచేయడం, బహిరంగ మల, మూత్ర విసర్జన, పారిశుధ్య చర్యలు సక్రమంగా చేపట్టకపోవడంతో వెనుకంజలో నిలిచింది.

చెత్త కష్టాలను తొలగించాలి

పట్టణ శివారులోని తూర్పు గుంటూరుపల్లి కాలనీకివెళ్లే మార్గంలో రోడ్డుపక్కనే పాడుబడిన బావి పూడ్చివేత పేరిట చెత్తను డంప్‌చేస్తున్నారు. కానీ ఇష్టానుసారం పారబోస్తూ తగలబెడుతున్నారు. గాలికి చెత్త, చెదారం పొలాల్లోకి కొట్టుకువస్తున్నది. చెత్త కాల్చడంతో రాత్రింబవళ్లు పొగ కమ్ముకొని ఆ దారిన వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనుల సమయంలో పొగతో ఊపిరి పీల్చుకోవడం కష్టంగా ఉంది. మునిసిపల్ అధికారులు, సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు చొరవ వహించి చెత్తకష్టాలు తొలగించాలి.

- ఒగ్గు శ్రీశైలం, చేర్యాల

అధికారులు, సిబ్బందికి చిత్తశుద్ధి లేదు

మునిసిపల్ అధికారులు, సిబ్బందికి చెత్తసేకరణ, డంపింగ్ పట్ల చిత్తశుద్ధి లేదు. రోడ్డుపక్కన ఎక్కడ చూసినా చెత్తకుప్పలే కనిపిస్తున్నా ఒక్కనాడైనా పారిశుధ్య పనులను పర్యవేక్షించడం లేదు. కేవలం పన్నుల వసూళ్లపై తప్ప ప్రజారోగ్యం పట్ల వారికి శ్రద్ధ లేదు. చెత్తను ఇష్టానుసారం పారబోస్తూ కాల్చివేస్తున్నారు. తూర్పుగుంటూరుపల్లి, జూనియర్ కాలేజీ వెనక కెనాల వెంబడి డంప్‌చేసి కాలబెడుతున్నారు. పేరుకే మునిసిపాలిటీగా ఉన్నా పారిశుధ్యంలో అధ్వానంగా తయారైంది. దోమల బెడద తీవ్రంగాఉన్నా కనీసం ఫాగింగ్ చేయడం లేదు.

- కె. కరుణాకర్, చేర్యాల

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట కల్చరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇంగ్లిష్ 2, మ్యాథమెటిక్స్ 1, హిస్టరీ 1, తెలుగు 1, కామర్స్ 1, కంప్యూటర్ 2 పోస్టులు ఉన్నాయని, అర్హత ఆసక్తి కల్గినవారు జూలై 23 వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

● **చేర్యాల:** చేర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి ఈ నెల 24వతేదీ సాయంత్రం 4గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రణీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాటనీ-1, జువాలజీ-1, కామర్స్-1, ఇంగ్లీష్-1, హిస్టరీ-1, పొలిటికల్ సైన్స్-1, కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్ -1 విభాగాల్లో ఖాళీలున్నాయని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత పీజీ కోర్సుల్లో 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, ఎస్సీ, ఎస్టీలకు 50శాతం, నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగినవారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

కస్తూర్బా విద్యాలయంలో 23న స్పాట్ అడ్మిషన్లు

హుస్నాబాద్‌రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ స్పాట్ అడ్మిషన్లు ఈ నెల 23 బుధవారం రోజున నిర్వహిస్తున్నట్లు విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ మమతయాదవ్ పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో సీఈసీ, ఎంఎల్‌టీ కోర్స్ ఇంగ్లీష్‌మీడియంలో సీట్లు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా 6వ తరగతిలో ఖాళీగా ఉన్న 10 సీట్లలో చేరేందుకు ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 23న కస్తూర్బా గాంధీ విద్యాలయానికి వచ్చి అడ్మిషన్లు పొందాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్ 746493220లో సంప్రదించాలని కోరారు.

కుటుంబానికి చేయూత


ఆర్థికసాయం అందజేస్తున్న అత్తు ఇమామ్

సిద్దిపేట జూలై 20 (ఆంధ్రజ్యోతి): హత్య నేరంలో భర్త జైలుకు వెళ్లడంతో రోడ్డున పడిన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఆర్థిక సాయమందించి అండగా నిలిచాడు. సిద్దిపేట పట్టణంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు చెందిన మహిళను ఆమె అల్లుడు ఇన్సూరెన్స్ డబ్బుల కోసం కారుతో గుద్ది హత్య చేసి జైలుపాలు కావడంతో, నిందితుడి భార్య 26 రోజుల పసిపిల్లతో వీధిన పడినట్టయ్యింది. ఈ సమాచారమందుకున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. వెంట కాంగ్రెస్ నాయకులు ఆలకుంట మహేందర్, గ్యాదరి మధు, గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్లు ఇవ్వాలి


మాట్లాడుతున్న గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి

చేర్యాల, జూలై 20(ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ నేపథ్యంలో గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్లు ఇవ్వాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆలేటి యాదగిరి పేర్కొన్నారు. ఆదివారం చేర్యాల పట్టణంలోని బీరప్ప ఆలయ ఆవరణలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతోమంది పేదలు గొర్రెలు, మేకల పోషణపై ఆధారపడి జీవిస్తున్నప్పటికీ సీజనల్ వ్యాధులతో పాటు నట్టల నివారణ మందులను ప్రభుత్వం సరఫరా చేయకపోవడం తగదన్నారు. అనంతరం చేర్యాల మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నంగి చంద్రమౌళి, ఉపాధ్యక్షుడిగా తుప్పతి రాజు, కార్యదర్శిగా దాసరి కనకయ్య, సహాయ కార్యదర్శిగా దేవులపల్లి కరుణాకర్, సలహాదారుడుగా ఎగుర్ల ఎల్లయ్య, సభ్యులుగా గుంటి స్వామి, ఆవుల యాదగిరి, బీరయ్య, బాబు ఎన్నికయ్యారు.

కర్బూజపై అమ్మవారి చిత్రం



గజ్వేల్ రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం చివరి ఆదివారం సందర్భంగా కర్బూజ కాయ మీద ఒక వైపు బోనం, మరో వైపు అమ్మవారి చిత్రాన్ని ఆవిష్కరించి తన భక్తిని చాటుకున్నాడు రామకోటి రామరాజు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి ఆశిస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. 30 సంవత్సరాల నుంచి అనేక చిత్రాలను చిత్రిస్తున్నారు.

బెజ్జంకి పీఎస్‌ను సందర్శించిన సీఐ


పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీఐ శ్రీను

బెజ్జంకి, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బెజ్జంకి పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను సందర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఎన్నికల నేపథ్యంలో ప్రణాళికను ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్టేషన్‌కు వచ్చిన పలువురు ఫిర్యాదు దారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సౌజన్య, ఏఎస్ఐ శంకర్‌రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను వేగంగా పూర్తి చేయాలి

మద్దూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోటాలో మద్దూరు, లద్నూరు, వంగపల్లి గ్రామాల్లో మంజూరైన లబ్ధిదారుల ఇళ్లకు ఆదివారం బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మద్దూరులో మండల పార్టీ అధ్యక్షుడు మేక సంతోష్ ఆధ్వర్యంలో ఇట్టబోయిన శాంతమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. లబ్దిదారులు వేగవంతంగా పూర్తి చేసుకోవాలని సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలి

మద్దూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ పార్టీ జెండాను ఎగురవేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఆదివారం వంగపల్లిలో గ్రామశాఖ, ఇన్‌చార్జి చేర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.

న్యూస్ బాక్స్

చేర్యాల కస్తూర్బాలో నేడు ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

చేర్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కస్తూర్బా విద్యాలయ జూనియర్ కళాశాలలో సీఈసీ-ఇంగ్లిషు మీడియంలో 20సీట్లు ఖాళీగా ఉన్నాయని కస్తూర్బా ప్రత్యేకాధికారి కె.కృష్ణవేణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు తెలిపారు. 10వతరగతి పాసై ఆసక్తిగల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీజేపీ మండల ఎన్నికల ప్రభారిల నియామకం

సిద్దిపేట రూరల్/ గజ్వేల్ రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ సిద్దిపేట రూరల్ మండల ఎన్నికల ప్రభారిగా జిల్లా అధికార ప్రతినిధి జిల్లెల్ల రమేష్‌గౌడ్‌ను నియమించారు. అదేవిధంగా గజ్వేల్ మండల ప్రభారిగా మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టీ మండల నాయకులు వారిని ఆదివారం శాలువాలతో సన్మానించారు.

మల్లన్న ఆలయ చైర్మన్ పదవిని విశ్వబ్రాహ్మణులకు కేటాయించాలి

చేర్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పదవిని విశ్వబ్రాహ్మణులకు కేటాయించాలని విశ్వబ్రాహ్మణ మాతృసంఘం రాష్ట్ర కార్యదర్శి వజ్రోజు శంకరాచారి అన్నారు. ఆదివారం చేర్యాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమాజ నిర్మాణంలో విశ్వబ్రాహ్మణుల పాత్ర కీలకమని, జనాభాలో సముచితస్థానం కలిగిన విశ్వబ్రాహ్మణులను గుర్తించాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రాయపోల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ మండలానికి చెందిన ఐదుగురికి సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థికసాయం మంజూరైంది. ఈ మేరకు ఆదివారం మండల బీజేపీ అధ్యక్షుడు మంకిడి స్వామి లబ్ధిదారుల కుటుంబీకులకు రూ.1,52,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు టెంకంపేట నర్సింలు, తూర్పు లక్ష్మణ్, వెంకటేష్, స్వామి, శ్రావణ్, నాగరాజు పాల్గొన్నారు.

● **చేర్యాల:** చేర్యాల మునిసిపల్, రూరల్ మండలం, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన 68మందికి సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థిక సాయం మంజూరైంది. ఈ మేరకు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు రూ.17.60లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

రాయపోల్‌లో వికసించిన బ్రహ్మ కమలాలు



రాయపోల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అత్యంత అరుదుగా వికసించే బ్రహ్మకమలం ఇళ్లలో శుభప్రదంగా భావిస్తారు. శనివారం రాత్రి రాయపోల్‌లోని సత్తుగారి తిరుపతిరెడ్డి ఇంటి ఆవరణలో పెంచిన మొక్కలకు 5 బ్రహ్మకమలం పుష్పాలు వికసించాయి. ఈ విషయం తెలిసిన చుట్టుపక్కలవారు వాటిని చూసేందుకు రావడంతో ఇంట్లో సందడి నెలకొన్నది. ఈ సందర్భంగా సదరు కుటుంబీకులు బ్రహ్మకమలాలకు పూజలు చేశారు.

డివిజన్ సాధనలో బంద్‌కు సహకరించండి


కొమురవెల్లి మండలకేంద్రంలో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

కొమురవెల్లి,జూలై20(ఆంధ్రజ్యోతి): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనే లక్ష్యంగా ఈ నెల 25న తలపెట్టిన బంద్‌కు వర్తక వాణిజ్య సంఘాలు, ప్రజలు సహకరించాలని ఆదివారం కొమురవెల్లి మండల కేంద్రంలో అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేర్యాల ప్రాంతం క్రమంగా ఉనికిని కోల్పోతూ అస్తిత్వమే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమయంలో పార్టీల ఎజెండాలు కాకుండా ప్రజల ఎజెండాయే లక్ష్యంగా నాయకులందరూ ముందుకు సాగాలన్నారు. ఈ నేపథ్యంలో చేపట్టిన మండలాల బంద్‌ను విజయవంతం చేసి చేర్యాల డివిజన్ ఆకాంక్షను ప్రభుత్వానికి బలంగా చాటుదామన్నారు. జేఏసీ నాయకులు అందె అశోక్, అందె బీరయ్య, బస్వగాళ్ల సిద్దయ్య, బుట్టి సత్యనారాయణ, యాదగిరి, అంజయ్య, సురేష్ పాల్గొన్నారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

చేర్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న తలపెట్టిన చేర్యాల బందును విజయవంతం చేయాలని ఆల్‌ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ తెలంగాణ కంట్రోల్ కమిటీ చైర్మన్ అందె బీరయ్య పిలుపునిచ్చారు. ఆదివారం చేర్యాల మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతోనే చేర్యాల అస్తిత్వం ఆధారపడి ఉందని, ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం గుర్తించి చిరకాల స్వప్నం నెరవేర్చాలని కోరారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చొరవ వహించాలని కోరారు. సమావేశంలో నాయకులు యాదయ్య, రాజు, తిరుపతి, నవీన్, వెంకటేశం, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన బాధితుడికి సహాయం అందించాలి


పోతారం(ఎస్) వద్ద టిప్పర్లను ఆపి ధర్నా నిర్వహిస్తున్న మీర్జాపూర్ గ్రామస్థులు

హుస్నాబాద్‌రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామానికి చెందిన గడ్డం అయిలయ్యను ఈనెల 14న పోతారం(ఎస్) వద్ద మట్టిని తరలిస్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో అయిలయ్య తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో ప్రమాదకర పరిస్థితిలో ఉన్నాడు. ఆసుపత్రి ఖర్చులు భరిస్తామని చెప్పిన టిప్పర్ యజమాని ఇంతవరకు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని బాధితుడికి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం మీర్జాపూర్ గ్రామస్థులు పోతారం(ఎస్) రోడ్డుపై టిప్పర్‌లను ఆపి అడ్డంగా బైఠాయించి ధర్నా నిర్వహించారు. బాధితుడికి సహాయం అందించే వరకు దీక్ష కొనసాగిస్తామని గ్రామస్థులు పేర్కొన్నారు.

నీటి హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట బీఆర్ఎస్వీ నాయకులు

సిద్దిపేట జూలై 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నీటి హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని సిద్దిపేట బీఆర్ఎస్వీ నాయకులు తెలిపారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్వీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంకటి నవీన్‌గౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు పయ్యావుల శ్యామ్‌యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ వరకు, సిద్దిపేటలోని అన్నీ విద్యాసంస్థల్లో ఆంధ్రప్రదేశ్ జలదోపిడీ, గోదావరి నది జలాల్లో తెలంగాణ వాటా, బనకచర్ల ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్రానికి జరిగే అన్యాయాన్ని విద్యార్థులకు వివరిస్తామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి బనకచర్ల ప్రాజెక్టు విషయంలో చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారారని ఆరోపించారు. రాష్ట్ర నీటి హక్కులలో రాష్ట్రాన్ని తాకట్టు పెడితే సహించబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

కార్యక్రమంలో నాయకులు గరిపల్లి మహిపాల్ గౌడ్, గుజ్జ రాజు, బండి శ్రీకాంత్, ఇరుగంటి రమేష్, చెట్టుపల్లి భానుచందర్, మేరుగు మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ ఇన్విటేషన్ లీగ్ టోర్నమెంట్


మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు బహుమతుల ప్రదానోత్సవం

గజ్వేల్ రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రజ్ఞాపూర్ బాయ్స్ హై స్కూల్‌లో పాఠశాలస్థాయి వాలీబాల్ ఇన్విటేషన్ లీగ్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో ఆరు జట్లు పాల్గొనగా, అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఆర్‌ఆర్ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం, ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం, అహ్మదీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ కార్యక్రమంలో క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ ఎంఎస్‌కే హైదర్‌పటేల్, ప్రెసిడెంట్ విజయరేఖ, సెక్రటరీ గోవర్ధన్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి వివేక్ వెంకట స్వామిని కలిసిన కాంగ్రెస్ నాయకులు


మంత్రి వివేక్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నకోడూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి ఆదివారం హైదరాబాద్ నుంచి రామగుండం వెళ్తుండగా చిన్నకోడూరు మండలం చెర్ల అంకిరెడ్డిపల్లి స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అజ్జుయాదవ్, అనిల్‌కుమార్, శ్రీనివాస్ గౌడ్, రమేషచారి, వెంకటేశం, ప్రభాకర్‌రెడ్డి, నర్సయ్య, సంపత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భరతనాట్య శిక్షణ శిబిరం


ముగింపు శిబిరంలో చిన్నారుల నృత్యప్రదర్శన

చేర్యాల, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వివేకానంద టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేర్యాల మండలకేంద్రంలో కొద్దిరోజుల పాటు నిర్వహించిన ఉచిత కూచిపూడి, భరతనాట్య శిక్షణ శిబిరం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు చేపట్టిన నృత్యాలు ఆహూతులను అలరించాయి. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

దుబ్బాకలో అమ్మోర్లకు ఆషాఢ పూజలు


పోతారంలో అమ్మవారిని దర్శించుకున్న దుబ్బాక ఎమ్మెల్యే

దుబ్బాక, జూలై20(ఆంధ్రజ్యోతి): దుబ్బాక మండలంలో ఆదివారం వివిధ గ్రామాలల్లో గ్రామదేవతల పూజలు ఘనంగా జరిగాయి. దుబ్బాక పట్టణంలోని మారేమ్మ, పోశమ్మ, ఎల్లమ్మ, మహంకాళీ ఆలయాల్లో భక్తులు బోనాలను సమర్పించి, ఘనంగా ఆషాడ పూజలు నిర్వహించారు. పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గల మైసమ్మ తల్లికి కూడా బోనాలు తీశారు. మండలంలోని పోతారం గ్రామంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి మహంకాళమ్మ జాతర, బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. వెంట మాజీ జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచు గడీల జనార్దన్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, కొత్త అంజిరెడ్డి, తదితరులున్నారు.

మర్పడగ క్షేత్రంలో ఆది కృత్తిక మహోత్సవం

కొండపాక, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆది కృత్తిక మహోత్సవం సందర్భంగా సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన వల్ల అనేక శుభ ఫలితాలు కలుగుతాయని మర్పడగ క్షేత్రం నిర్వాహకుడు చెప్పెల హరినాథశర్మ పేర్కొన్నారు. కొండపాక మండలం మర్పడగ శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున క్షేత్రంలో ఆదివారం ఆది కృత్తిక మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రంలో వెలసిన సుబ్రహ్మణ్య స్వామికి విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించారు.

మర్పడగలో ఉచిత కంటి వైద్యశిబిరం

కొండపాక, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం మర్పడగ గ్రామంలో సిద్దిపేటకు చెందిన ఆద్య కంటి హాస్పిటల్ సిద్దిపేట డాక్టర్ మాధవి, డాక్టర్ బాలకిషన్ కంటి వైద్య నిపుణుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గ్రామానికి చెందిన 90మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఇరవై మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. ఇందులో తక్షణమే ఏడుగురిని సిద్దిపేటకు తీసుకువెళ్లి ఉచితంగా కాటరాక్ట్ ఆపరేషన్ చేసి సురక్షితంగా ఇంటివద్దకు చేర్చారు.

బెల్టుషాపుల చిచ్చు

(5వ పేజీ తరువాయి)

కార్యాచరణ ప్రారంభించారు. ఇలా మొదలైన ఉద్యమం అన్ని గ్రామాలకు విస్తరించేలా చూస్తామని మహిళలు ముక్తకంఠంతో చెబుతున్నారు.

అన్ని గ్రామాల్లో ఉద్యమాలు చేపడతాం



గ్రామాల్లో బెల్టుషాపులు ఉండటంతో యువకులు మద్యానికి బానిసగా మారుతున్నారు. ఎన్నో కుటుంబాలు నాశనమవుతున్నాయి. అధికారులకు ఎన్ని మార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. గ్రామాల్లో మద్యం అమ్మకాలపై ఉక్కుపాదం మోపాలి. అధికారులు పట్టించుకోకపోతే మహిళలను ఏకం చేసి మద్యం మహమ్మారికి వ్యతిరేకంగా అన్ని గ్రామాల్లో ఉద్యమాలు చేపడతాం

- దేవరాయ ఎల్లం, పెద్దమాసాన్‌పల్లి గ్రామస్థుడు